# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

**SEPTEMBER-2012**

సంవత్సర చందా రూ.50/-

సత్యవాణి-క్రీస్తుసంఘము

# బైబిల్ లెక్చర్‌షిప్

Bible Lectureship, Kakinada.

సమయం : **2012 నవంబరు 6,7,8 తేదీలు**
ఉదయం 10:00 గంటలకు.
మధ్యాహ్నం 3:00 గంటలకు.
సాయంత్రం 6:00 గంటలకు.

స్థలం : **సత్యవాణి - క్రీస్తుసంఘము**
7-9-35 సాంబమూర్తి వీధి
కుళాయిచెర్వు ఎదురుగా
కాకినాడ-533 004.

ప్రసంగీకులు : **క్రీస్తుసంఘము**లో పేరు గాంచిన
ప్రఖ్యాత అంతర్జాతీయ సువార్తికులు
మరియు స్వదేశ సువార్తికులు.

వసతి, భోజనము : ఉచితము; మొదట్లో 20/- రూ॥లు
రిజిస్ట్రేషన్‌ఫీజు చెల్లించవలెను.

మీరు కుటుంబ సమేతముగా రావచ్చును. దారిఖర్చులు ఎవరికి వారే భరించవలెను. మీరు వచ్చి ఆత్మీయముగా మేలు పొందండి. అందరికి ఆహ్వానము! అందరికిస్వాగతము!!

ఫోన్: 0884-2363722
-2363697

వందనములతో
రిక్కీగూటం
జాషువాగూటం

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

P.o. Box -80, Kakinada, A.P. 533 001
Ph : 0884 - 2363722


Editor :
**Joshua Gootam**


*Pleading for Restoration of First Century Christianity*


సంపుటి - 33 | సెప్టెంబరు -2012 | సంచిక - 2


## మనలో నివసించు పరిశుద్ధాత్మ
## (Indwelling of the Holy Spirit)

పరిశుద్ధాత్మ యొక్క అద్భుత వరములను గూర్చి గత పాఠములో మనము నేర్చుకొనియున్నాము. ఆ యద్భుతవరములు క్రొత్తనిబంధన సంపూర్తిగ వ్రాయబడగా లేక అపొస్తలు లందరు చనిపోగా నిలిచిపోయెనని మనము గ్రహించి యుంటిమి, అయితే యేసు క్రీస్తునందు నమ్మి బాప్తిసము పొందిన ప్రతి వానికిని పరిశుద్ధాత్మ అను వరము వాగ్దానము చేయబడెను. పెంతెకోస్తునాడు మొట్ట మొదట సువార్త ప్రసంగమును చేయుచు "పేతురు - మీరు మారు మనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరము పొందుదురు. ఈ వాగ్దానము మీకును, మీపిల్లలకును, దూరస్థులందరికిని చెందునని వారితో చెప్పెను" (అపొ.కా. 2:38,39).

పరిశుద్ధాత్మ యొక్క అద్భుత వరములకును, ఇక్కడ చెప్పబడిన పరిశుద్ధాత్మ అను వరమునకు గొప్ప వ్యత్యాసమున్నది. ఎవరైతే సువార్తకు

లోబడుదురో అట్టివారు పరిశుద్ధాత్మను పొందుదురు. ఇది అద్భుతములు చేయు శక్తి కాదు. "మేమును, దేవుడు తనకు విధేయులైనవారికి అనుగ్రహించిన పరిశుద్ధాత్మయు, ఈ సంగతులకు సాక్షులమై యున్నామని" అపొస్తలులు అపొ.కా. 5:32లో చెప్పిరి "ఆయన ఆజ్ఞలను గైకొనువాడు ఆయనయందు నిలచి యుండును. ఆయన వానియందు నిలచియుండును; ఆయన మనయందు నిలచియున్నాడని ఆయన మన కను గ్రహించిన ఆత్మమూలముగా తెలిసికొను చున్నాము" అని యోహాను వ్రాసెను (1యోహాను 3:24). క్రీస్తుయొక్క ఆజ్ఞలను గైకొనుటద్వారా క్రైస్తవుడు క్రీస్తునందు నిలిచియుండును; అప్పుడు క్రీస్తును, పరిశుద్ధాత్మయు వారిలో నిలిచియుందురు.

క్రైస్తవునిలో పరిశుద్ధాత్ముడు నివసించడు అని ఎవరైనను తలంచిన యెడల అట్టివారు దేవుని ఉనికినే తిరస్కరించు వారగుదురు. "ఏమానవుడును దేవుని ఎప్పుడునుచూచి యుండలేదు; మన మొకనినొకడు ప్రేమించిన యెడల దేవుడు మనయందు నిలిచియుండును; ఆయన ప్రేమ మన యందు సంపూర్ణమగును .... ఏలయనగా ఆయన మనకు తన ఆత్మలో పాలు దయచేసి యున్నాడని"1 యోహాను 4:12-13లో వ్రాయబడి యున్నది. క్రైస్తవునిలో నివసించు పరిశుద్ధాత్ముని మన మెవరము భౌతిక నేత్రములతో చూడ లేకపోయినను, క్రైస్తవుని జీవితములో ఆత్మఫలములను క్రియలను మనము చూడగలము. ఒక చెట్టును దాని ఫలముల వలన అది మంచిదో లేక చెడ్డదో మనము తెలిసికొనగలమని క్రీస్తు బోధించెను (మత్తయి 7:16-20). అట్లే క్రైస్తవుడు ఫలించు ఫలములనుబట్టి అతడు పరిశుద్ధాత్మను కలిగియున్నాడో లేదో మనము తెలిసికొనగలము.

"అయితే ఆత్మ ఫలమేమనగా -ప్రేమ, సంతోషము, సమాధానము, దీర్ఘశాంతము, దయాళుత్వము, మంచితనము, విశ్వాసము, సాత్వికము, ఆశానిగ్రహము, ఇట్టి వాటికి విరోధమైన నియమమేదియు లేదు" అని గలతీ 5:22, 23లో అపొ. పౌలు బోధించెను.

క్రైస్తవులమని చెప్పుకొనుచు ఒకని నొకరు ద్వేషించుకొనువారు, కలహము లాడువారు, అసూయ, మత్సరము అపవిత్రతో నిండియున్నవారు పరిశుద్ధాత్మ వారిలో నివంచుటలేదని బహిరంగముగా సాక్ష్యమిచ్చువారై యున్నారు. అట్టి వారిలో నివసించునది అపవిత్రాత్మయే గాని దేవుని ఆత్మ కాదు.

ప్రేమతో నిండియున్న హృదయములలో తండ్రి కూమార, పరిశుద్ధాత్మలు నివసించుచు రాజ్యమేలుదురు. దేవుని ప్రజలు ఎల్లప్పుడు సంతోషము కలిగిన

వారు. క్రైస్తవుని హృదయములో సమాధానము పరిశుద్ధాత్మ వలన కలుగు ఫలమై యున్నది. అందుకే "సమాధాన పరచువారు ధన్యులు వారు దేవుని కుమారులనబడుదురు" అని యేసు బోధించెను (మత్తయి 5:9). క్రైస్తవుని హృదయములో పరిశుద్ధాత్ముడు నివసించునప్పుడు అతని జీవితములో దీర్ఘశాంతము, దయాళుత్వము, మంచితనము, విశ్వాసము, సాత్వికము, ఆశానిగ్రహము అను గుణములు బాహాటముగ కన్పడును. ఇట్టి ఆత్మఫలములను ఫలించువాడే దేవుని ఆత్మను కలిగియున్నవాడు. ఈ ఆత్మ ఫలములు అద్భుత వరములు కావు.

క్రీస్తునందు విశ్వసించి, మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందిన ప్రతి క్రైస్తవునిలోను పరిశుద్ధాత్ముడు నివసించును. కొరింధులోని క్రైస్తవులకు వ్రాయుచు అపో.పౌలు ఇట్లనుచున్నాడు :"మీ దేహము దేవుని వలన మీకు అనుగ్రహింపబడి "మీలోనున్న పరిశుద్ధాత్మకు ఆలయమై యున్నదని మీరెరుగరా? మీరు మీ సొత్తుకాదు. విలువ పెట్టికొనబడినవారు గనుక మీ దేహముతో దేవుని మహిమ పరచుడి" (1కొరింధి 6:19,20). మన దేహములు దేవుని ఆత్మకు ఆలయమై యున్నప్పుడు దానిని మన మెంత పవిత్రముగ యుంచవలెనో నేను మీకు వేరే చెప్పనవుసరము లేదు. "మీరు దేవుని ఆలయమై యున్నా రనియు, దేవుని ఆత్మ మీలో నివసించుచున్నాడనియు మీరెరుగరా? ఎవడైనను దేవుని ఆలయమును పాడుచేసిన యెడల దేవుడు వానిని పాడుచేయును. దేవుని ఆలయము పరిశుద్ధమైనది : మీరు ఆ ఆలయమై యున్నారు" అని 1కొరింధి 3:16, 17లో పౌలు మరల మనలను హెచ్చరించుచున్నాడు.

మనము చూచిన ఈ వచనముల నుబట్టి మనము క్రీస్తు ఆజ్ఞలకు విధేయత చూపించినప్పుడు పరిశుద్ధాత్ముడు మనలో నివసించుచు మనలను సన్మార్గమున నడిపింపజేయును అనిగ్రహించితిమి. మనము దేవుని చిత్తముకు లోబడినప్పుడే ఆయన ఆత్మ మనలో నివసించును. అయితే ఒకని హృదయము పాపముతో నిండియుండిన యెడల అతనిలో పరిశుద్ధాత్మునికి తావు లేదు. అట్లు గాక క్రైస్తవుని హృదయములో పరిశుద్ధాత్ముడు నివసించుచున్నయెడల అతడు తన జీవితములో ఆత్మఫలములను కనబరుచును.

అయితే పరిశుద్ధాత్ముడు మనలో ఎట్లు నివసించును ? అనే ప్రశ్న మనకు ఇప్పుడు ఉద్భవింపవచ్చును. ఈ నాడు నేను జీవించియున్నాను. నాఆత్మ నాలో నివసించుచున్నదని నేనురుగుదును. అదిఎట్లు నివసించుచున్నదో నేరెరుగను

గాని నాఆత్మ నాలో నివసించుచున్నదని నేనెరుగుదును. అయితే దేవుని "ఆత్మను గూర్చిన వాగ్దానము విశ్వాసము వలన మనకు లభించును" అని గలతీ 3:14లో అపొ. పౌలు చెప్పుచున్నాడు. ఈ విశ్వాసము దేవుని వాక్యమును వినుట ద్వారా కలుగునని రోమా 10:17లో అతడు బోధించెను.

దేవుని వాక్యము ద్వారా దేవుని ఆత్మ మనలో నివసించునని దైవవేదము బోధించుచున్నది. "ఆత్మపూర్ణులై యుండుడి" యని ఎఫెసీ 5:18లో పౌలు హెచ్చరించుచున్నాడు. కొలస్స 3:16లో క్రీస్తు వాక్యము మీలో సమృద్ధిగా నివసింపనియ్యుడియని అతడు చెప్పాడు. గనుక క్రీస్తు వాక్యమును మనలో సమృద్ధిగా నివసింప నిచ్చుటయే ఆత్మతో నింపబడుటయని మనము గ్రహించు కొనగలము.

పరిశుద్ధాత్ముడు దేవుని వాక్యము ను అపొస్తలులకు బయలుపరచెను. దేవుని వాక్యము ఆత్మఖడ్గమైయున్నది (ఎఫెసీ 6:17). పరిశుద్ధాత్ముడు వాక్యము వలన "పాపమును గూర్చియు, నీతిని గూర్చియు తీర్పును గూర్చియు లోకమును ఒప్పుకొనజేయును" (యోహాను 16:18). పరిశుద్ధాత్ముడు ఖడ్గమును వినియోగిం చును. ఆ ఖడ్గమే దేవుని వాక్యము. "ఎందుకనగా దేవుని వాక్యము సజీవమై బలముగలదై రెండంచులు గల యెటు వంటి ఖడ్గము కంటెను వాడిగా ఉండి, ప్రాణాత్మలను, కీళ్ళను, మూలుగను విభజించునంత మట్టుకు శోధించు చున్నది" (హెబ్రీ 4:12) "అందుచేత సమస్త కల్మషమును, విర్రవీగుచున్న దుష్టత్వమును మాని లోపల నాటబడి మీ ఆత్మలను రక్షించుటకు శక్తిగల వాక్యమును సాత్వికముతో అంగీకరిం చుడి" యని యాకోబు 1:21 చెప్పు చున్నది.

పరిశుద్ధాత్ముడు దేవుని వాక్యము ద్వారా మనలో నివసించును. దేవుని వాక్యముద్వారానే ఆయన మనలను రక్షించును. క్రైస్తవునిలో నివసించు పరిశు ద్ధాత్మయే చావునకు లోనైన అతని శరీ రమును జీవింపజేయును : "మృతులలో నుండి యేసును లేపిన వాని ఆత్మ మీలో నివసించినయెడల, మృతులలోనుండి క్రీస్తు యేసును లేపినవాడు చావునకు లోనైన మీశరీరములను కూడ మీలో నివసించుచున్న తన ఆత్మ ద్వారా జీవింప జేయును" యని రోమా 8:11లో వ్రాయ బడి యున్నది.

పరిశుద్ధాత్ముడు క్రైస్తవునిలో నివసించునను సంగతి యథార్థము. అది అద్భుతములు, నానారకములైన అర్థ రహితమైన భాషలు పలికించునట్టి ఆత్మకాదు. నిజముగా దేవుని ఆత్మను

కలిగి యున్నవాడు ఆత్మఫలములను ఫలించుచు దేవునికి మహిమ తెచ్చును. దేవుని ఆత్మ లేనివారు వేషధారులై ప్రజలను మోసపుచ్చుచు తమ్మును తామే మోసపుచ్చుకొందురు.

తండ్రియైన దేవుడు కుమారుని ద్వారా వాగ్దానము చేసిన పరిశుద్ధాత్మ అను వరమును పొందవలెనంటే అది ఈనాడు నీకును సాధ్యమే. క్రీస్తునందు విశ్వాస ముంచుము, నీపాపముల విషయమై మారుమనస్సు నొందుము. క్రీస్తు నామమును ఒప్పుకొనుచూ బాప్తిస్మము పొందుము. ఆయన నీపాపములను క్షమించి పరిశుద్ధాత్మ అను వరమును నీకు తప్పక అనుగ్రహించును (అపో.కా 2:38).

## దేవ దూతల యొక్కపని
## (The work of Angels)

"ఆదియందు దేవుడు భూమ్యాకా శములను సృజించెను" (ఆది.కా. 1:1). ఆధికాండములో దేవదూతల సృష్టిని గూర్చి చెప్పబడకపోయినను ఏకైక సృష్టి కర్తయైన దేవునిచేదూతలు సృజింపబడిరని మన మెరుగుదుము. నెహెమ్యా 9:6 ఇట్లు చెప్పుచున్నది: "నీవే అద్వితీయుడవైన యెహోవా. నీవే ఆకాశమును మహాకాశ ములను వాటిలో ఉండునది అంతటిని సృజించి వాటినన్నిటిని కాపాడువాడవు. ఆకాశసైన్య మంతయు నీకే నమస్కారము చేయుచున్నది". దేవదూతలు దేవునిచే సృజింపబడిన వారు.

దేవునికి పరచర్యచేయు ఆత్మలుగా దేవుడు దూతలను సృజించారు (హెబ్రీ 1:14). దేవదూతలను గూర్చి మనకు తెలిసిన దంతయు, వారి ఆరంభము, సంఖ్య, తత్వము, తరగతి, శక్తి, పరిమితి, పని వగయిరా అంతయు దైవావేశము చే లిఖింపబడిన దేవుని గ్రంథము వలన మాత్రమే తెలిసికొన గలము. దేవ దూతలను గూర్చి గ్రంథము వలన మాత్రమే తెలిసికొన గలము. దేవ దూతలను గూర్చి వారి పనిని గూర్చి మన ఊహా జ్ఞానములు పనికిరావు.

**సరిపడినంతసంఖ్య :**

దేవునిపనిని జరిగించడానికి సరి పడినంత సంఖ్యలో దేవదూతలున్నారని లేఖనములలో మనకు కనబడుచున్నది, దేవుని దూతలు కోటనుకోట్లగా యున్నారని తెలియజేయుటకు దేవుడు యోహానుకు ఒక దూత ద్వారా బయలు పరచెను (ప్రకట 5:11). హెబ్రీ పత్రిక లేఖకుడు వేవేలకొలది యున్న దూతలను గూర్చి వ్రాసాడు (హెబ్రీ 12:22).

**కావలికాయువారు :**

ఆదాము హవ్వలు ఏదెను నుండి వెడలగొట్టబడిన వెంటనే దూతయొక్క పని రికార్డు చేయుబడెను. "అప్పుడాయన ఆదామును వెళ్లగొట్టి ఏదెను తోటకు తూర్పుదిక్కున కెరూబులను, జీవ వృక్షము నకు పోవు మార్గమును కాయుటకు ఇటు అటుతిరుగుచున్న ఖడ్గజ్వాలలనునిలువ బెట్టెను" (ఆదికా 3:24). జీవవృక్షమును కాపలా కాయుపనిని దేవుడు కెరూబులకు అప్పగించెను.

**పాతనిబంధనలో వార్తావాహులు:**

పాతనిబంధనలో దేవుడు తన వర్త మానము నందించుటకు దూతలను పంపెను. హాగరు తనయజమాను రాలియైన శారా దగ్గరకు తిరిగి వెళ్లవలెనని యెహోవా దూత ఆమెకు చెప్పెను (ఆది.కా. 16:9). ఆదికాండము 22:11లో దూత అబ్రాహామును పిలిచెను. దుష్టత్వములో యున్న సొదొమ పట్టణమునుండి లోతును అతని కుటుంబమును రక్షించుటకు దూతలు పంపబడిరి (ఆది.కా. 19:16). వారు లోతును అతని కుమార్తెలను రక్షించ గలిగిరి. లోతు భార్య దూత యొక్క హెచ్చరికను మన్నించనందున నశించెను. బెయేర్షబాలో ఒక బదరీవృక్షముక్రింద పండుకొని యున్న ఏలియా దగ్గరకు దూత ఒకడు పంపబడెను (1రాజులు 19:3-5). ఆదూత అతని ప్రోత్సాహపరచి, అతనికి భోజనము సిద్ధపరచి అతనికి హాని కలుగు కుండా కాపాడెను. సింహముల బోనులో నుండి దానియేలును ఒక దూత రక్షించెను (దానియే 6:22). మరియు హనన్యా, మిషాయేలు, అజర్యా అనువారిని మండుచున్న అగ్నిగుండము నుండి రక్షించెను (దాని 3:28).

**క్రొత్త నిబంధనలో వార్తావాహులు:**

జెకర్యాకు కలుగుబోవు కుమారుని గూర్చి దేవుని దూత అతనికి వర్తమానము తెలియజేసెను (లూకా 1:11-19). యోసేపుకు ప్రదానము చేయబడిన కన్యయైన మరియ గర్భము దాల్చి రక్షకుడైన యేసుకు జనన మిచ్చునని ఒక దూత ఆమెకు తెలి యజేసెను (లూకా 1:26-38). తనకు ప్రదానము చేయ బడిన స్త్రీ గర్భవతియై యుండుటను గూర్చి యోసేపు సందేహించు చుండగా మరలా దేవ దూత అతనికి పుట్టబోవు శిశువును గూర్చిన వర్తమానము నందించెను (మత్త 1:19-25). ఆమె కన్యకగదా? యని అతడాలోచించుచుం డెను. ఆమెకన్యకయే. దేవుని దూత పరలోక సైన్యసమూహములతో గొర్రెల కాపరుల యొద్దకు వచ్చి వారికి రక్షకుని గూర్చిన సంతోషవర్త మానము తెలియు జేసెను. ప్రభువైన క్రీస్తు జన్మించెను (లూకా 2:8-14).

**దూతలు సువార్త చాటు వారుకాదు:**

ప్రజలకు ప్రభువైన యేసు సువార్తను బోధించు పని ఎన్నడు దేవ దూతలకు అప్పగింపబడలేదు. రక్షణ మార్గమును ప్రకటించే బాధ్యతను దేవుడు కేవలము మానవులకు మాత్రమే అప్పగించారు (మత్తయి 28:18–20).

అపొ.కా. 8:26లో సువార్త విన వలసిన ఒక ఘనుని గూర్చి దూత ఫిలిప్పు అను సువార్తికునికి తెలియజేసెను. ఆ ఇతియోపీయ దేశపు అధికారికి సువార్తను బోధించుటకు దేవుడు తన దూతను పంపలేదు. ప్రభువుదూత ఫిలిప్పు సమరయ నుండి దక్షిణముగా వెళ్లి యెరూషలేమునుండి గాజాకు పోవు మార్గమున కందాకే రాణి యొక్క ఆర్థిక మంత్రితో కలిసికొమ్మని అతనికి చెప్పెను (అపొ.కా. 8:26–27). ఫిలిప్పు అతనికి క్రీస్తును గూర్చిన సువార్తబోధించి బాప్తిస్మమిచ్చెను.

ప్రార్థనలో యున్న కొర్నేలీకి దేవ దూత కనబడి అతడేమి చేయవలెనో సూచించెను (అపొ.కా. 10:1–3). దేవ దూతయే కొర్నేలీకి సువార్త బోధించలేదు గాని రక్షణవాక్యము వినుట కొరకతడు పేతురును పిలువనంపవలెనని సూచనలిచ్చెను. వెంటనే కొర్నేలీ సీమోను పేతురుకు కబురుపంపెను. పేతురు వచ్చి అతనికిని అతని యింట నున్న వారికిని సువార్తబోధించెను. వారు వాక్యమును విని దేవుని ఆజ్ఞలకు విధేయత చూపిరి.

**విడిపించుటకు దూతలు:**

అపొస్తలుల కాలములో శత్రువులచేత బంధింపబడిన వారిని విడిపించుటకు దేవుడు తన దూతలను వినియోగించెను. అపొస్తలులను చెరసాలనుండి విడిపించుటకు దేవుడు తన దూతను పంపెను (అపొ.కా. 5:19). అపొస్తలులను బంధించినవారు, లేదా చెరసాలకు కాపలాయున్న వారు ఆదూతను ఎన్నడు చూడలేదు. చెరసాలనుండి అపొస్తలులు తప్పించు కొనుట కూడ వారు చూడలేదు. అపొస్తలుల కార్యములు 12వ అధ్యాయములో రాజైన హేరోదు అపొస్తలుడైన యాకోబును చంపించి, పేతురును కూడ పట్టుకొని చెరసాలలో బంధించియుంచుట చూడగలము. అతనికి కావలిగా నాలుగు చతుష్టయముల సైనికులను అతడుంచెను. 5వ వచనములో పేతురు కొరకు సంఘము అత్యాసక్తితో ప్రార్థన చేయుట మనము చూడగలము వారు ప్రార్థన చేయుచున్న యింటికి వచ్చి పేతురు తలుపు తట్టెను. పేతురు కొరకు సంఘము యొక్క ప్రార్థనను దేవుడు విని తన దూతను పంపి చెరసాలనుండి పేతురును విడిపించెను (అపొ.కా. 12:7).

ఒక ఓడలో పౌలు రోమాకు ప్రయాణము చేయుచుండగా అది గొప్ప తుఫానుకు గురియాయెను. అయితే

దేవునిదూత ఒకడు అతనికి ప్రత్యక్షమై అతనికిని, ఓడలో నున్న వారికిని ఖచ్చితమైన హెచ్చరికలిచ్చెను (అపో.కా. 27: 21-31). దేవదూతలు ప్రతిసారి ఒంటరిగానే పనిచేయలేదు. ప్రభువైన యేసు క్రీస్తు అరణ్యములో శోధింపబడగా దేవ దూతలు ఆయనకు పరిచారము చేసిరి (మార్కు 1:13). తాను ప్రార్థన చేస్తే తండ్రియైన దేవుడాయనకొరకు 12 సేనావ్యూహముల (72 వేల మంది) కంటే ఎక్కువ దూతలను పంపునని యేసుచెప్పెను (మత్తయి 26:53). బీద లాజరు చనిపోగా దేవదూతలు అతని అబ్రాహాము రొమ్మున అనుకొనుటకు కొనిపోయిరి (లూకా 16:22).

నేడు కూడా దూతలు చురుకుగా పనిచేయచున్నారు. బైబిలు చెప్పుచున్నది గనుక యిది సత్యము. "సహోదరప్రేమ నిలువరముగా ఉండనీయుడి. ఆతిథ్యము చేయ మరవకుడి, దాని వలన కొందరు ఎరుగకయే దేవదూతలకు ఆతిథ్యము చేసిరి"యని మనము హెచ్చరింపబడి యున్నాము (హెబ్రీ 13:1-2). ఆగొప్ప విమోచన దినమందు యేసు ప్రభువు మరల వచ్చునప్పుడాయన ఒంటరిగా రారు. ఆయన తన పరిశుద్ధదూతల సమూహముతో వచ్చును (మత్తయి 24:31;25;31; 2 థెస్స 1-7-9).

– మిక్కీబర్ష్సన

## రాహేలు, ప్రియురాలైన భార్య
## (Rachel, A Beloved wife)

(ఆదికాండము 29:1-31:35)

ఆదికాండము 27, 28 అధ్యాయములు చదివితే లాబాను కుమార్తెయగు రిబ్కా బంధువు రాలైన రాహేలును గూర్చిన పూర్వచరిత్ర మనం గ్రహించుకోగలము. రిబ్కా యొుక్క కవలలైన ఏశావు, యాకోబులు తల్లి గర్భములో యుండగానే ఒకనితో నొకడు పెనుగులాడిరి (ఆదికా 25:22-26). తండ్రియైన ఇస్సాకు వృద్ధుడై కనుచూపు మందగిలిన సమయములో సంప్రదాయ ప్రకారము తన జ్యేష్ఠ కుమారుని దీవించ గోరెను. అయితే తన తల్లియైన రిబ్కా యొుక్క ప్రోద్బలము వలన యాకోబు తన తండ్రిని మోసగించి ఏశావుకు రావలసిన దీవెనలను తండ్రి యొద్ద నుండి పొందెను. సహజంగా ఏశావు కోపోద్రిక్తుడై తన తండ్రి మరణానంతరము యాకోబును చంప నుద్దేశించెను. యాకోబును రక్షింపగోరి, రిబ్కా అతనిని ఆమె తండ్రి యింటికి పోయి తనకొక భార్యను వెదుకునట్లు పంపించి వేసెను. యాకోబు పద్దన రాముకుపోయి లాబాను కుమార్తెలలో

ఒకదానిని పెండ్లాడునట్లు ఇస్సాకు అతని పంపించివేసెను. అప్పుడు ఒక పురుషునికిని స్త్రీకిని మధ్య గొప్ప ప్రేమ గాథ ఆరంభమాయెను.

యాకోబు 450 మైళ్ల ప్రయాణం చేసి తన గమ్యస్థానము చేరు కొనెను. గొర్రెల కాపరులు తమ మందలకు నీళ్లు పోయు ఒక బావి దగ్గర ఆగి అతడు లాబానును గూర్చి విచారింపగోరెను. లాబాను కుమార్తెయగు రాహేలు తన తండ్రి మందలకు నీళ్లు పెట్టుటకు అక్కడికి వచ్చుచున్నదని యాకోబు తెలిసికొనెను. ఆమె గొర్రెలకు నీళ్లు చేది పోయుటకు యాకోబు సహాయపడి తనను గూర్చి పరిచయము చేసికొనెను. వెంటనే రాహేలు తన యింటికి పరుగెత్తికొని పోయి యాకోబును గూర్చి తన తండ్రికి తెలియజేసెను. లాబాను కూడ పరుగెత్తు కొనివెళ్లి యాకోబును కలిసికోని తన యింటికి అతనిని ఆహ్వానించెను.

తదుపరి ఒక మాసము మట్టుకు అతడు లాబానుకు పనిచేయచు అతనితో నివసించెను. ఆసమయమందు సురూపియైన రాహేలును అతడు ప్రేమించెను. భార్యకు కట్నముగా యిచ్చుటకు అతడేమీ తీసికొని రానందున, రాహేలు కొరకు ఏడు సంవత్సరములు మట్టుకు లాబానుకు పని చేయుటకు అతడు ఒప్పందము చేసి కొనెను. అతడామెను ప్రేమించుట వలన అవి అతనికి కొద్ది దినములుగా తోచెను (ఆదికా 29:20). ఏడు సంవత్సరములైన తరువాత రాహేలును తనకు పెండ్లికిమ్మని అడుగు టకు యాకోబు లాబాను యొద్దకు వెళ్లెను.

లాబాను ఆస్థలములో నున్న మనుష్యులనందరిని పోగుచేసి విందు చేయించి యాకోబుకు తన కుమార్తె నిచ్చి పెండ్లిచేసెను. ఉదయ మందు ఆమె రాహేలు కాదుగాని లేయా యని అతడు గమనించెను. నీవు నాకు చేసిన ఈపని యేమిటి యని యాకోబు లాబానును వివరణ అడిగెను. అందుకు లాబాను పెద్దదాని కంటె ముందు చిన్నదానినిచ్చుట తమ దేశమర్యాద కాదని చెప్పెను. మరియు లేయా యొక్క వివాహవారము సంపూర్ణము చేసి, మరి యేడు సంవత్సరములు అతడు లాబానుకు కొలువ చేస్తే అప్పుడు రాహేలును కూడ అతనికిచ్చెదనని లాబాను యాకోబుకు చెప్పెను. యాకోబు అందుకు ఒప్పు కొనెను.

లేఖనములు చదువుచుండగా ఆనాటి జనులయొక్క ఆచారములను కూడ తెలిసికొనుట ముఖ్యము. నేటి మన ఆచారములు ఆయాప్రాంతాలలో వేర్వేరుగా యున్నాయి. మరియు ఆధునిక పద్ధతులకు పురాతన పద్ధతులకు గొప్ప

వ్యత్యాసమున్నది. మన సాంప్రదాయములను బట్టి బైబిలు సంఘటనలు పరికించితే కొంత గందరగోళం ఏర్పడును. యూదుల వివాహసంప్రదాయము దిగువ వర్ణించబడినది. వివాహములో ముఖ్యముగా పెండ్లి కుమార్తెను తన తండ్రి యింటి నుండి లేదా అతని తండ్రి యింటికి చేర్చుట జరుగును. ఆ కార్యక్రమమునకు పెండ్లి కుమారుడు ప్రత్యేకముగా సిద్ధపడును. పెండ్లి వస్త్రములను ధరించుకొని, తలపాగా పెట్టుకొనును. పెండ్లి కుమార్తె కూడ తన్నుతాను అలంకరించుకొనును (యెష 61:10). ముఖము మీద తెల్లని వస్త్రములు ధరించుకొనును (ప్రకటన 19:8). ఆమె వస్త్రములు కొన్నిసార్లు బంగారు బుట్టా పని చేయబడినవి మరియు సుంగధ ద్రవ్యములతో నిండుకొనినవి క్రీర్త 45:13). ఆమె విలువైన నగలు ధరించుకొనును క్రీర్తన 45:8-9; యెషయా 49:18, 61:10; ప్రక 21:2). వివాహ నిర్ణీత సమయము వచ్చినప్పుడు (సాధారణంగా సాయంకాలపు వేళ) పెండ్లి కుమారుడు తన పరివారముతో తన యింటి నుండి బయలు దేరును.

సంధ్య చీకటివేళ పెండ్లి కుమార్తె పైనుండి క్రింది వరకు పెండ్లి ప్రస్తములతో కప్పబడి యున్నందున రాహేలుకు బదులు లేయాను వివాహమాడునట్లు యాకోబు సులభముగా మోసగించబడెను. సూర్యోదయమగు వరకు యాకోబు ఈ మోసమును గుర్తించలేకపోయెను. జ్యేష్ఠ కుమారునికి రావలసిన దీవెనలను పొందుటకు యాకోబు తన తండ్రిని ఎట్లు మోసగించెనో లాబాను యొక్క జ్యేష్ఠ కుమార్తె పెండ్లాడునట్లు అతడు కూడ మోసగించబడెను.

ఒక వారము తరువాత యాకోబుకు యిద్దరు భార్యలుండిరి. అతడు గాఢంగా ప్రేమించిన ఒకామె. మరొకరు ఆమెను పెండ్లాడునట్లు అతడు మోసగించబడిన వ్యక్తి. లేయాకంటె రాహేలును యాకోబు ఎక్కువ ప్రేమించుచున్నాడని దేవుడు చూచినప్పుడు దేవుడు రాహేలు గర్భమును మూసెను. ఆమె గర్భము ధరించకుండెను. లేయా గర్భమును దేవుడు తెరిచెను (ఆదికా 29:31). లేయాకు నలుగురు కుమారులు కలుగగా, తనకు గర్భఫల మిమ్మని రాహేలు యాకోబును బలవంత పెట్టెను. యాకోబు కోపబడి ఆమె గొడ్రాలుగా యుండుటకు కారణము తాను కాదుగాని దేవుడేయని చెప్పెను. తదుపరి ఆమె తన దాసియైన బిల్హాను యాకోబునకిచ్చెను. లేయా కూడ తన దాసియైన జిల్పాను యాకోబునకిచ్చెను. ఇద్దరు దాసీలు యాకోబుకు కుమారులు కనిరి.

ఒకనాడు లేయా యొక్క జ్యేష్ఠ కుమారుడగు రూబేను ఆమెకు పుత్రదాత వృక్షపు పండ్లను తెచ్చియిచ్చెను. గర్భవతిగా నుండుటకు అత్యాసక్తి గలదై రాహేలు ఆపండ్ల కొరకు లేయాతో బేరమాడెను. లేయా యిచ్చిన పుత్ర దాత వృక్ష పండ్ల నిమిత్తము యాకోబు ఆరాత్రి లేయాతో శయనించునని రాహేలు బేరమాడెను. లేయా తన ఐదవ కుమారుని, ఒక కుమార్తెను కనెను. రాహేలు గొడ్రాలై యుండెను. లేయా యొక్క పిల్లలందరు జన్మించిన తరువాత దేవుడు రాహేలును జ్ఞాపకము చేసి కొనెను. ఆమె గర్భవతియై కుమారుని కనెను. అతనికి యోసేపు అని పేరు పెట్టబడెను.

ఏడు సంవత్సరముల కొలువు తీరిన తరువాత యాకోబు లాబానుతో, నన్ను పంపివేయుము, నాచోటికిని నా దేశమునకును వెళ్లెదను. నా భార్యలను నా పిల్లలను నా కప్పగించుము, అప్పుడు నేను వెళ్లెదననెను" (ఆదికా 30:25-26). అందుకు లాబాను నిన్ను బట్టి యెహోవా నన్ను ఆశీర్వదించెను గనుక నా యొద్దనే యుండుమనెను. మరియు నీజీతమింత యని చెప్పుము, అది యిచ్చెదననెను. అందుకు యాకోబు నీమంద అంతటిలో పొడలైనను మచ్చలైనను గల ప్రతి గొర్రెను, గొర్రెపిల్లలలో నల్లని ప్రతి దానిని, మేకలలో మచ్చలైనను పొడ లైనను గలవన్నియు నాకు జీతమగునెను. లాబాను అందుకు సమ్మతించెను. ఆరు సంవత్సరములలో యాకోబు మందలు బహుగా విస్తరించెను, లాబాను మందలు క్షీణించెను. లాబాను కుమారులు కూడ తమ తండ్రికి కలిగిన యావత్తును యాకోబు తీసికొని విస్తారమైన ఆస్థి సంపాదించు కొనెనని చెప్పుకొనుచుండిరి. లాబాను కూడ యాకోబు యెడల ముఖము చిన్నబుచ్చు కొనుచుండెనని అతడు గమనించెను.

చివరిగా యాకోబు కానానుకు తిరిగి వెళ్ళవలెనని దేవుడాతనికి తెలియ జెపెను. యాకోబు పొలములో తన మంద యొద్దకు లేయాను, రాహేలును పిలువనంపి తాను లాబానుకు తన యావచ్ఛక్తితో కొలువు చేసినను తమ తండ్రి యొక్క కటాక్షము యిదివరకువలె లేదని చెప్పెను. అతడు యాకోబును మోసపుచ్చి పది మారులు తన జీతము మార్చెను అయినను దేవుని అనుగ్రహము వలన అతడు దీవించడెనని వారికి చెప్పెను. దేవుడతనికి చెప్పిన సంగతులను గూర్చి యాకోబు తన భార్యలకు తెలియ జెప్పగా దేవుని ఆజ్ఞ చొప్పుననడుచుకొనుటకు వారును సంసిద్ధు లైరి. మరియు తమ తండ్రియే వారిని అన్యులుగా చూచుచున్నాడని అంగీకరిం చిరి. తన భార్యలు తనతో వెళ్లుటకు అంగీకరించినందున యాకోబు తన కమారులను, భార్యలను ఒంటెల మీద

ఎక్కించి తాను సంపాదించిన యావదాస్థిని తీసికొని లాబానుకు తెలియకుండ వెళ్లిపోయెను. మూడు దినముల పిమ్మట లాబాను ఈ సంగతి తెలిసికొని యాకోబును తరిమి కలిసికొనెను. మరియు అతడు తన గృహదేవతలను దొంగిలెననెను. తాము బయలు దేరకముందు రాహేలు ఆదేవతల బొమ్మలను దొంగిలెనని యాకోబుకు తెలియదు. నీవు అందరిని వెదకి ఎవరి యొద్ద నీ దేవతలు కనబడునో వారు బ్రతుకకూడదనెను. లాబాను వెదుకుచుండగా రాహేలు ఆ విగ్రహములను తీసికొని ఒంటె సామగ్రిలో పెట్టి వాటిమీద కూర్చుండెను. లాబానుకు ఆ విగ్రహములు దొరుకనందున అతడును యాకోబును సంధి చేసికొనిరి. లాబాను తన కుమార్తెలను, వారి కుమారులను ముద్దు పెట్టుకొని వారిని దీవించి బయలుదేరి తన ఊరికి వెళ్ళిపోయెను.

యాకోబు తన ప్రయాణమును కొనసాగించుచు, ఏశావును శాంతి పరచుటకు తన దూతలను పంపెను. వారు తిరిగి వచ్చి ఏశావు నాలుగువందల మందితో నిన్ను ఎదుర్కొనుటకు వచ్చుచున్నాడని చెప్పిరి. యాకోబు మిక్కిలి భయపడి తనను, తన కుటుంబాన్ని రక్షించుమని దేవుని ప్రార్థించెను. మరునాడు యాకోబు తాను సంపాదించిన దానిలో ఏశావుకు మేకలను, గొర్రెలను, పాడి ఒంటెలను, పొట్టేళ్లను, ఆవులను, ఆబోతులను, గాడిదలను కానుకగా పంపించెను. తన కుటుంబస్థులు ఎవ్విధముగా ప్రయాణం చేయాలో యాకోబు తన కుటుంబమునకు నిర్ణయించెను. తన దాసీలు, వారి పిల్లలు మొదటి వరుసలో పంపబడిరి. లేయా. తన పిల్లలు తదుపరి వెళ్లవలెను. రాహేలు యోసేపులు వారి వెనుక భాగముననున్న కుటుంబ సభ్యులు తప్పించుకో వచ్చని అతడు భావించాడు. ఇక్కడ కూడ యాకోబు రాహేలు యెడల తనకున్న ప్రేమను కనుబరచాడు. అయితే యాకోబు అనవసరముగా భయపడ్డాడు.—ఏశావు అతని స్వాగతించడానికే గాని చంపుటకు ఎదురు రాలేదు!

అనేక సంవత్సరముల తరువాత యాకోబు బేతేలుకు వెళ్లి, అక్కడ నివసించి దేవునికొరకు బలిపీఠము కట్టవలెనని దేవుడతనికి చెప్పెను. బేతేలుకు పయనించక ముందు యాకోబు తన సేవకులకు, కుటుంబ సభ్యులకు వారు తమతో తెచ్చుకొనిన దేవతవిగ్రహములను పారవేసి, శుభ్రపరచుకొని, నిజదేవుని నారాధించుటకు సిద్ధపడవలెనని చెప్పెను. వారు తమ యొద్దనున్న అన్యదేవతలన్నిటిని యాకోబు కు అప్పగింపగా వాటిని మస్తకి వృక్షము క్రింద పాతిపెట్టెను. మరికొంత కాలమైన పిమ్మట యాకోబు

తన కుటుంబముతో బేత్లెహేముకు వెళ్లెను. ఎఫ్రాతాకు వెళ్లు మార్గములో నిండుచూలాలియైన రాహేలు ప్రసవించుచు ఒక కుమారుని కని మృతిపొందెను. యాకోబు అతనికి బెన్యామీను అను పేరు పెట్టెను. యాకోబు రాహేలు సమాధిమీద ఒక స్థంభము కట్టించెను.

**యిర్మీయా 31:15, రూతు 4:11, మత్తయి 2:18:**

ఇశ్రాయేలీయులు బానిసలుగా కొనిపోబడుటను చూచి రాహేలు తన పిల్లలను గూర్చి యేడ్చుచున్నదని యిర్మీయా ప్రవచించాడు (యిర్మీయా 31:15). అనేక సంవత్సరముల తరువాత ఈ లేఖనమునే మత్తయి ఎత్తి చూపించాడు (మత్తయి 2:18). రాజైన హేరోదు రెండు సంవత్సరములు గల మగపిల్లలందరు వధించబడాలని శాసించగా మత్తయి ఈ ప్రవచన నెరవేర్పును గూర్చి వ్రాసాడు. యిది యిర్మీయా ప్రవచన నెరవేర్పని మత్తయి 2:17 చెప్పుచున్నది. బోయజు రూతును వివాహమాడినప్పుడు పురద్వారమున నున్న ప్రజలందరును, పెద్దలును రూతును రాహేలుతోను. లేయాతోను పోల్చి ఆశీర్వదించారు (రూతు 4:11). రాహేలు, లేయాల వలె రూతుకు కూడ గొప్ప సంతానము కలుగును గాకయని వారు ఆశీర్వదించారు. రూతు యొక్క వంశము లోనుండి క్రీస్తు వచ్చినందున, రాబోవు మెస్సీయను గూర్చి అయన సంఘమును గూర్చి చెప్పబడిన ప్రవచనము యిది.

రాహేలును యాకోబు ప్రేమించినను, దావీదు యొక్కయు మెస్సీయ యొక్కయు వంశావళి లేయా కుమారుడగు యూదా ద్వారా కలిగెను. రాహేలు తన పిల్లలను గూర్చి అంగలార్చుట చివరకు ఇశ్రాయేలీయుల శ్రమలకు సాదృశ్యమాయెను.

**నేర్చుకొనదగిన సూత్రములు :**

**రాహేలు బాధ్యత గలది. కృషి చేయునది :**

తన తండ్రి యొక్క మందలను మేపునదిగా మొట్టమొదట రాహేలు మనకు కనబడుతాది. తన తండ్రి గొర్రెలకు నీళ్ళు పోయుచున్నదిగా యాకోబు ఆమెను కనుగొంటాడు. ఆమె వయస్సు చెప్పబడలేదు గాని, వివాహమాడు వయసు గలది యని మనంగ్రహించుకోవచ్చును. మందను మేపునదిగా ఆమె గొర్రెల యొక్క క్షేమానికి, సంరక్షణకు బాధ్యురాలు. ఆమె ఏమరపుగా యుంటే గొర్రెల చెదరపోవచ్చును, క్రూర మృగములు వాటిని వేటాడ వచ్చును గొర్రెల కాపరులు తరుచు ఒంటరిగానే తమ గొర్రెలతో యుండుట జరుగును. వారి పనిని ఎవరు పర్య వేక్షించరు.

పాత క్రొత్తనిబంధనలు రెండు చురుకుగా పనిచేయువారిని హర్షిస్తాయి,

సోమరిని ఖండిస్తాయి. "ఉతక మీద తలుపు తిరుగును. తన పడకమీద సోమరి తిరుగును" (సామెతలు 26:14). "సోమరితనము చేత ఇంటికప్పు దిగబడి పోవును. చేతుల బద్ధకము చేత ఇల్లు కురియును" (ప్రసంగి 10:18). "ఆసక్తి విషయములో మాంద్యులు కాక ఆత్మ యందు తీవ్రత గలవారై ప్రభువును సేవించుడి" (రోమా 12:11). "మీరు మంద్యులు కాక విశ్వాసము చేతను ఓర్పుచేతను వాగ్దానములను స్వతంత్రిం చుకొను వారినిపోలి నడుచుకొనునట్లుగా మీలో ప్రతివాడును మీ నిరీక్షణ పరిపూర్ణమగు నిమిత్తము మీరిదివరకు కనుబరచిన ఆసక్తిని తుదమట్టుకు కనుపరచవలెనని ఆపేక్షించుచున్నాము" (హెబ్రీ 6:12). నీవెట్లు పనిచేయుదువు? నీ యజమాని లేక పోయినను శ్రద్ధగా పనిచేయుదువా? రాహేలు వలె కష్టపడి పనిచేసే లక్షణము నీకున్నదా ?

**రాహేలు ఈర్ష్యగలది :**

యితరుల కున్నది మనకు కావాలనే దుర్బుద్ధి వలన మనలను అసూయతో నింపే స్వభావమే ఈర్ష్య యాకోబు ప్రేమతో రాహేలు సంతృప్తి జెందలేదు. తన సహోదరి లేయాకు పిల్లలు కావాలని ఆమె యాకోబును కోరింది. లేయాకు నాలుగవ కుమారుడు కలిగిన తరువాత తనకు పిల్లలు కలుగక పోతే చనిపోవుట మేలని తలంచింది.

యితరులకున్న ఆస్థిపాస్తులను గూర్చి అసూయపడుట వలన సత్సంబంధాలు, కుటుంబాలు, సంఘముకూడ దెబ్బతింటాయి. సంఘములో అనేక సమస్యలకు ఈర్ష్య. అసూయలే కారణము. కుటుంబ సభ్యులలో ఈర్ష్యవలన అనేక కుటుంబాలు విచ్ఛిన్న మవుచున్నది.

"నేనే స్థితిలో యున్నను ఆస్థితిలో సంతృప్తి కలిగి యుండ నేర్చుకొని యున్నాను" అని పౌలు ఫిలిప్పీ 4:11లో చెప్పుచున్నాడు. దీనస్థితిలో యుండుట సంపన్న స్థితిలో యుండుట అతడెరుగును. క్రీస్తునందు అతడు శ్రమలను ఓర్చుకొన్నాడు. సమృద్ధియందు సంతోషించాడు. "నన్ను బలపరచువానియందే నేను సమస్తమును చేయగలనని" చెప్పాడు (ఫిలిప్పీ 4:13). నిన్నుఏమాత్రము విడువను నిన్ను ఎన్నడు విడువను అని ఆయనే చెప్పెను గనుక మనకు కలిగి యున్న దానితో తృప్తి జెంది యుందము (హెబ్రీ 13:5).

**తన కుటుంబ కలుషితము వలన రాహేలు ప్రభావితురాలయ్యెను:**

లాబాను మోసపూరితుడు, కఠినుడు. దురదృష్టావశాత్తు రాహేలు యిట్టి లక్షణములను కొన్ని కలిగి యుండెను. యాకోబు తనకు సంతాన మియ్యాలని. పొరాడుటలో ఆమె

కఠినురాలుగా కనబడుచున్నది. తన గర్భమును దేవుడే మూసి యుంచెను. అది యాకోబు బలహీనత కాదు.

లేయా తనకు పుత్రదాత వృక్ష ఫలము లియ్యాలని రాహేలు బలవంతము చేసింది. తాననుకొన్నది పొందుట కొరకు యాకోబును ఒకరాత్రి కొరకు లేయాకు విక్రయించినది. ఆమె లేయా యెడల ఎంత మోసకరముగా, కఠినముగా వ్యవహరించినను ఆమెకు సంతానము కలుగలేదు.

రాహేలు తన తండ్రి దేవత విగ్రహములను దొంగిలించి దాచిపెట్టేసింది. ఆమె విగ్రహారాధన చేసినట్లు లేఖనములు చెప్పుట లేదు. యాకోబు మాటచొప్పున ఆమె వాటిని విడిచిపెట్టినది. మోసము, అబద్ధము అనునవి భక్తిహీనుల లక్షణములు (సామె 24:8; మార్కు 7:22). దేవుని బిడ్డలమైన మనము వీటిని విసర్జించాలి (1 పేతురు 3:10). తన తండ్రియొక్క దుష్టలక్షణములు తనలో కూడ రాహేలు కొంత మట్టుకు ఇముడ్చుకొన్నది. తదుపరి యాకోబు యొక్క ప్రేమ, నిజ దేవుని యెడల అతనికున్న భక్తి వలన ఆమె మార్పు చెందినది. క్రైస్తవులుగా మనము దేవునికి ప్రీతికరమైన సేవకులుగా తయారగుటకు శత విధాల ప్రయత్నించాలి. బైబిలును శ్రద్ధగా చదవడం, క్రమముగా ఆరాధించడం, మిగతా క్రైస్తవులతో సహవాసము కలిగి యుండడము మొదలగు వాటి వలన మంచి లక్షణములు మనకు అలవరును.

నీవు రాహేలువలె యున్నావా? నీ ప్రవర్తన నీకుటుంబ సభ్యులవలె యున్నదా? నీవు భక్తి పరురాలవా? దేవుడు, మిగతా క్రైస్తవులు నీపై ఆధారపడగలరా?

– బోనీ రష్‌మోర్

## సిలువ యొక్క శక్తి
## (The Power of the Cross)

క్రీస్తు యొక్క సిలువ అనేకులకు అభ్యంతరముగాను అడ్డుబండగాను యున్నది (1 పేతురు 2:8; 1 కొరింథీ 1:23). "సిలువ మీద వ్రేలాడదీయబడిన వాడు రక్షకుడెట్లవుతాడు? అని యూదులు ప్రశ్నిస్తారు (ద్వితి 21:23; గలతీ 3:13). "రోమీయుల వలన సిలువ మరణ శిక్ష విధించబడిన వానిని దేవుడని ఎట్లారాధిస్తారు?" అని అన్య జనులు ప్రశ్నిస్తారు, ఈరీతిగా యేసు క్రీస్తును యూదులు, అన్యులు కూడ నిరాకరిస్తారు. "ఎందుకనగా మనమాయన యందు దేవుని నీతియగునట్లు పాపమెరుగని ఆయనను మనకోసము పాపముగాచేసెను" అని పౌలు ఆలోచన చెబుతున్నాడు (2 కొరింథీ 5:21).

'సిలువ' అనే మాట యేసువలన ప్రపంచ ప్రఖ్యాతి గాంచి యున్నది. అది మానవుని అజ్ఞానమునకు పాపముకు గురుతుగా యున్నది. ఆనాడున్నట్టి పాలకులు, అధిపతులు ఆయన ఎవరో ఎరిగి యుంటే ఆయనను సిలువ వేసియుండక పోదురు (అపొ.కా. 3:17; 1కొరింథీ 2:8). బుద్ధిపూర్వకమైన అజ్ఞానమువలన క్రీస్తుసిలువ వేయబడి నను, అది దేవుని కృప ప్రేమలకు సూచన యాయెను (రోమా 5:8).

**సిలువ యొక్క వైవిధ్యము :**

- అదిచరిత్రలో జరిగిన ఘోరమైన విషాదము. అయినను అది ఆశ్చర్య కరము
- అది గొప్ప విచారకర సంఘటన, అయినను అది గొప్ప సంతోషము కలిగించెను.
- అది సాతాను యొక్క గొప్ప విజయము క్రీస్తు యొక్క అపజయము.
- అది సాతాను యొక్క ఘోర అప జయము అయినను అది క్రీస్తుయొక్క మహిమ గల విజయము.
- దేవుని న్యాయము పాపముకు శరీరములో శిక్ష విధించెను గాని ఆయన కృపపాపమును క్షమించెను.
- మానవ దృక్పథములో అది వెర్రి తనము గాని అది దేవుని గొప్ప జ్ఞానము యొక్క బయల్పాటు (గలతీ 6:14, 2:20).

రక్తము' అను మాట గౌరవనీయమైనది కాదని ఒక ఆధునిక బోధకు డన్నాడు. గనుక వారి పాటలన్నిటి లోనుండి రక్తమను మాటను కొట్టివేసారు! రక్తములో విమోచనశక్తి ఏమైనా యున్నదని వారనుకొనలేదు. ఒకాయన ఇట్లన్నారు: "నేను రక్తమును గూర్చి సిగ్గుపడను, నాతల్లి మమ్మును రక్షించడా నికి రైలులో నుండి బయటకుత్రోసేసింది గాని ఆ రైలు ప్రమాదములో తన రక్తము చిందించింది".

"వెండి బంగారముల వంటి క్షయమైన వస్తువులచేత మీరు విమో చింపబడలేదుగాని అమూల్యమైన రక్తము చేత అనగా నిర్దోషమును నిష్కళంకము నగు గొర్రెపిల్ల వంటి క్రీస్తురక్తము చేత విమోచింపబడితిరి" (1పేతురు 1:18-19). క్రీస్తు రక్తములో శక్తియున్నది. నాకది తెలుసు! ఎందుకనగా బైబిలు అట్లు చెప్పు చున్నది. అదిచాల విపులముగా బయలు పరచబడినగొప్ప వాస్తవము (మత్త 26:28; 20:28; అపొ.కా. 2:38, హెబ్రీ 2:9). జంతువుల రక్తము విమోచింపలేదు (హెబ్రీ 9:26; 10:1-4). ఎంత క్రూరుడైన మనుష్యుడైనను సరే క్రీస్తు రక్తములో యున్న శక్తివలన రక్షింపబడగలడు (కొలస్స 1:20-22 ; ఎఫెసీ 2:3-6).

మన ప్రభువు యొక్క మరణము అకస్మాత్తుగా జరుగలేదు. దానిని గూర్చి ముందుగనే తెలియ జేయబడెను, పస్కా బలిలో అది చిత్రీకరించబడెను

(నిర్గమ 12, యోహాను 1:29, యెషయా 53:7-12; మత్తయి 8:17; అపొ.కా. 8:32).

**అయన మరణము దిగివ సంగతులను సాధించెను:**

1. అయన తన రాజ్యమైన సంఘమును స్వరక్తమిచ్చికొనెను (అపొ.కా.20: 28).
2. అయన యూదులను అన్యులను ఏకము చేసెను, సమాధానపరచెను (ఎఫెసీ 2:16).
3. అయన పాతనిబంధనను కొట్టివేసి క్రొత్తనిబంధను స్థిరపరచెను (హెబ్రీ 13:20).
4. అయన సాతాను శక్తిని నాశనము చేసెను (హెబ్రీ 2:14;1 యోహాను 3:8).
5. అయన పాప పరిహారము గావించెను(1యోహాను 2:1;4:10).
6. మరణముయొక్క భయము గల వారందరినీ దాని నుండి విడిపించెను (హెబ్రీ 2:15).

రక్షణ అందరికీ అనుగ్రహించబడెను, గాని కొందరు నిరాకరించుట వలన, నిర్లక్షము చేయుట వలన ఈగొప్ప రక్షణను అందరు పొందలేరు. నయామానువలె అనేకులు దురభిమాన ద్వేషమును కలిగి యున్నారు (2 రాజులు 5:1-14). అందరు రక్షింపబడాలని దేవుడు కోరుచున్నారు (2 పేతురు 3:9). అయితే వారు ఇరుకును, సంకుచితమునైన ద్వారములో ప్రవేశించాలి (మత్తయి 7:13).

మనము దేవుని సంతోషపరచాలంటే మనము చేయునదంతా సిలువను కేంద్రముగా చేసికొని యుండాలి. మనం మన సొంతమార్గము నెంచుకొన రాదు, మన యిష్టప్రకారము నడువరాదు. "నేనే మార్గమును, సత్యమును, జీవమునై యున్నాను. నాద్వారానే తప్ప యెవడును తండ్రి యొద్దకు రాడు" అని యేసు చెప్పెను (యోహాను 14:6). సిలువమార్గమే క్రీస్తు మార్గము!

- బిల్ నిక్స్

## భూమి మీద క్రీస్తు యొక్క వెయ్యేండ్ల పాలన ఉండునా ?
## (Will there be a 1000 year Reign of Christ on Earth?)

యేసుక్రీస్తు ఈలోకమునకు వచ్చి యెరూషలేములో దావీదు సింహాస నముపై నుండి వెయ్యేండ్లు పాలన చేయరు అను వాస్తవమును తెలిసి కొనుటకు క్లుప్తముగా దిగువ సంతులను గమనిం చుదము.

1. కొన్యా యొక్క సంతతివాడెవడు యెరూష లేములో యుండి యూదాను ఎన్నడు పాలించడని యిర్మీయా ప్రవచించాడు (యిర్మీ 22:24. 28-30). క్రీస్తు నేరుగా యెకొన్యా సంతతినుండి

ఉద్భవించారు (మత్తయి 1:11,12). అందు వలన క్రీస్తు యెరూషలేములో యూదా సింహాసనము పై యుండ నేరడు.

2. మెల్కీసెదెకు క్రమము చొప్పున క్రీస్తు యాజకుడై యున్నారు (హెబ్రీ 6:20). మెల్కీసెదెకు యాజకుడు, రాజు కూడాను (హెబ్రీ7:1). అంటే క్రీస్తు ఒకేసమయమందు రాజు, యాజకుడై యుండనేరడు (హెబ్రీ8:4). ఆయన యాజకుడు, రాజై యున్నందున భూమిమీద ఆయన రాజై యుండనేరడు !

3. ప్రకటన గ్రంథము 20 అధ్యాయములో క్రీస్తును, ఆయనతోను సింహాసనముల మీద ఆసీనులై యున్నవారు భూమిమీద కాదు గాని పరలోకములో ఏలుచున్నారు.

ఎ) ప్రకటన 20:4లో సింహాసనముల మీద ఆసీనులై యున్నవారు "క్రూర మృగము నకైనను దాని ప్రతిమకైనను నమస్కారము చేయక తమ నొసళ్ల యందుగాని చేతుల యందుగాని దాని ముద్రవేయించుకొనని వారు".

బి) మరియు "ఆక్రూరమృగమునకును దాని ప్రతిమకును దాని పేరు గల సంఖ్యకును లోబడక వాటిని జయించిన వారు ...స్ఫటికపు సముద్రము మీద నిలిచి యున్నవారు" (ప్రకటన 15:2). స్ఫటికపు సముద్రమును పోలిన గాజువంటి సముద్రము దేవుని సింహాసనము ఎదుటనున్నది (ప్రకటన 4:6). దేవుని సింహాసనము ఎదుటనున్న స్ఫటిక సముద్రము భూమిమీద గాక పరలోకము లోనున్నది! అందు వలన క్రీస్తుతో కూడ సింహాసనములపై యుండి పాలించుచున్న వారు భూమి మీద గాక పరలోకములో వుండి ఏలుచున్నారు.

సి) యోహాను చూచిన దర్శనములో కనబడు సాతాను సింహాసనము క్రూరమృగ సింహాస నము తప్ప అన్ని సింహాసనములు పరలోకమందు కనపబడ్డాయి (ప్రకట 2:13;16:10). ప్రకటన1:4;3:21;4: 2,5,6,9,10, 10;5:1, 6,7,11,15,17;8:13;11:16; 14:3-5;16:17;19:4,5; 20:4, 11;21:5; 22:1-3 లను చూడుము.

డి) వెయ్యేండ్లు అనుమాట పరిస్థితులను వర్ణించుటకే గాని ఒక నిర్ణేత కాలమును సూచించుటకు వాడబడలేదు. ప్రకటన 20:4లో చెప్పబడినవారు మొదటి పునరుత్థానములో పాలుపొందిరి. వారిపై రెండవ మరణమునకు అధికారము లేదు (20:5) అయితే ప్రకటన 2:11లో జయించువారు రెండవ మరణము వలనహాని చెందరు. వారు జయించువారు, విజేయులు, దేవుని సేవించువారు. దేవుని ప్రజలు తమను హింసించువారిపై సాధించు పరిపూర్ణ విజయాన్ని వెయ్యేండ్లుగా అలంకార రీతిగావా డబడినది.

యి) ప్రకటన గ్రంథములో క్రీస్తుయొక్క వెయ్యేండ్లపాలనను గూర్చి యోహాను

చూచి వ్రాసిన సంగతులు భవిష్యత్తులో సంభవించేవికాదు. "ఈ సంగతలు త్వరలో సంభవింపనై యున్నవని" ప్రకటన 1:1లో చెప్పబడెను. ప్రకటన 1:3లో "సమయము సమీపించినది" అని చెప్పబడెను. యోహాను ద్వారా దేవుడైనా అసత్యముపలికి యుండాలి, లేదా ఈ సంగతులు సంభవించి పోయాయి. యోహాను పరిశుద్ధాత్మా వేశముచే లిఖించాడు గనుక నేనతని మాటలను నమ్ముదును.

ఎఫ్) ప్రకటన 1:5లో యేసు క్రీస్తు భూపతు లకు (రాజులకు) అధిపతియై అప్పటికే అయ్యున్నట్లు చెప్పబడినది. యేసుక్రీస్తు పరలోకమునకు ఆరోహణుడై దేవుని కుడిపార్శ్వమున కూర్చున్నప్పుడు "సకల జనులును రాష్ట్రములును ఆయాభాషలు మాటలాడువారును ఆయనను సేవించు నట్లు ప్రభుత్వమును మహిమయు ఆధిపత్యమును ఆయన కీయబడెను. ఆయన ప్రభుత్వము శాశ్వతమైనది. అదెన్నటికిని తొలగిపోదు, ఆయన రాజ్యము ఎప్పుడు నులయముకాదు" అని దానియేలు 7:13-14 చెప్పుచున్నది.

జి) 1 కొరింథీ 15:24-28 క్రీస్తు ఇప్పుడు రాజులకు రాజుగా పాలించుచున్నాడని చెప్పుచున్నది. మరియు క్రీస్తువచ్చినప్పుడు "ఆయన సమస్తమైన ఆధిపత్యమును, సమస్తమైన అధికారమును, బలమును కొట్టివేసి తన తండ్రియైన దేవునికి రాజ్యము అప్పగించును; అప్పుడు అంతము వచ్చును". ఈ లేఖన భాగములలో ఎక్కడా క్రీస్తు యొక్క భూసంబంధపాలన గాని, రాజ్యము గాని చెప్పబడలేదు, అట్లు ఉద్దేశించబడలేదు.

బైబిలులోగాని, ప్రకటన గ్రంథములో గాని క్రీస్తు భూమిపై యెరూషలేములో నుండి వెయ్యేండ్లు పాలించుననే సిద్ధాంతమునకు ఆధారము యేమీ లేదు. సరిగదా మనము వాగ్దానము చేయబడిన "క్రొత్త ఆకాశముల కొరకును క్రొత్త భూమి కొరకును కనిపెట్టుచున్నాము. అక్కడ నీతి నివసించును" (2 పేతురు 3:13).

– కోలినేమెకీ

## "బోధకులు రెవరెండ్లని పిలువబడాలి"

## (Preachers should be called Reverend)

బోధకులు రెవరెండ్‌లని పిలువబడాలనేదొక అబద్ధబోధ. అట్లు పిలువబడుట వలన ప్రజలు బోధకులయందు అమిత విశ్వాసము ప్రకటిస్తారు. మరియు అట్టిబోధకుల బోధను ప్రశ్నించడానికి ప్రజలు భయపడ్తారు. వారి బోధలకు బైబిలు నిదర్శనములియ్యాలని ప్రజల వారినడు గరు. అయితే మిత్రులారా, అది అట్లుండ కూడదు. 'రెవరెండ్' అనే ఆంగ్లపదము ఇంగ్లీషు బైబిలు అంతటిలో

ఒకే ఒక్కసారి వాడబడినది. ఆ ఒక్క దఫా అది యెహోవా దేవునికి వాడబడినది. ఆయన నామము పరిశుద్ధమైనది, పూజింపతగినదని" కీర్తన 111:9లో వ్రాయబడి యున్నది. "Holy and Reverend is His name". "యెహోవా నామము నకు చెందవలసిన ప్రభావమును ఆయనకు ఆరోపించుడి" యని కీర్తన 29:2 చెప్పుచున్నది.

చాల మందికి ఇంకొక సంగతి తెలియదు. అదేమంటే బోధకులను బైబిలు ఎన్నడు పాస్టర్లని పిలుచుటలేదు. సంఘము యొక్క పాస్టర్ (కాపరి) సంఘపెద్ద అయ్యుండును. ప్రతి స్థానిక సంఘములోను ఒకని కంటే ఎక్కువ మంది పెద్దలుందురు. వారు దేవుని మందను సంరక్షించు వారు (అపో.కా. 20:28). దేవుడు తన స్వరక్త మిచ్చిన సంపాదించిన సంఘమును కాయుడి యని సంఘపెద్దలకు (పాస్టర్లకు) అక్కడ చెప్పబడినది. పాస్టర్ అనగా మందను కాయువానియర్థము. మంద కాపరులు గొర్రెలమందలను పర్యవేక్షించే వారు, సంరక్షించేవారు. ఇదే భావము సంఘ పెద్దల (పాస్టర్ల) విషయంలో వ్యక్తపరచ బడినది. యేసుక్రీస్తు అత్యున్నత బోధకుడే అయినను ఆయన రెవరెండ్ అని ఎన్నడు పిలువ బడలేదు. ఆయన పరిశుద్ధాలయము నకు పరిచారకుడని హెబ్రీ 8:2లో చెప్ప బడినది.

మత్తయి 23:8లో యేసుతన శిష్యులనుద్దేశించి మీరందరు సహోదరులని చెప్పారు. 2 కొరింథీ 2:13లో 'సహోదరుడైన తీతు' ను గూర్చి చెప్ప బడినది. హెబ్రీ 13:23 మన సహోదరుడైన తిమోతిని గూర్చి చెబుతాది. క్రీస్తు సంఘములో యుండి అనేకసంవత్సరములు మట్టుకు బోధించుచున్న యోహాను "మీసహో దరుడును" అని ప్రకటన 1:9లో చెప్పుచున్నాడు 2 పేతురు 3:15లో మన ప్రియసహోదరుడైన పౌలును గూర్చి పేతురు చెబుతాడు. 1కొరింథీ 16:12 సహోదరులైన ఎక్కువ మందిని గూర్చి చెబుతాది. మిత్రు లారా, డినామినేషన్ల బోధకులను సహోదరులని పిలువ కూడదు, వారు ప్రభువునందున్నవారు కాదని ఈలేఖన భాగములను బట్టి గమనించుము.

1థెస్స 3:4 లో 'మన సహోద రుడును, క్రీస్తువార్త విషయములో దేవునిపరిచారకుడునైన తిమోతిని "గూర్చి చెప్పబడినది. సువార్తికులను పరిచారకులని (Ministers) పిలు చుట లేఖనార్థమైనదని ఇక్కడ తెలిసికొనుచున్నాము. రోమా15:16లో పౌలు యేసుక్రీస్తు పరిచారకుడ నైతినియని తన్ను గూర్చి చెబుతాడు, "అపొల్లో ఎవడు? పౌలెవడు? పరి చారకు లేగదా"యని 1కొరింథీ 3:5 చెప్పుచున్నది. ఎఫెసీ 3:7లో పౌలు

క్రీస్తు "సువార్తకు పరిచారకుడనైతిని" యని చెబుతాడు. "మీలో ఎవడు గొప్పవాడై యుండగోరునో వాడు మీపరిచారుకుడై యుండవలెను" అని మత్తయి 20:26లో యేసు బోధించారు. 1తిమోతి 4:6లో పౌలు తిమోతిని "మంచిపరిచారకుడవై యుందువు" అని హెచ్చరించాడు. "ఆసువార్త విషయములో నేను ప్రకటించు వాడను గాను అపొస్తలుడను గాను, బోధకుడనుగాను నియమింపబడితినని" పౌలు చెప్పాడు (2 తిమో 1:11). ఈహేతువు చేతను వారిని సహోదరులని పిలుచుటకు సిగ్గుపడుట లేదని హెబ్రీ 2:12లో వ్రాయబడియున్నది.

"వారు తమ దురాశల చొప్పున నడుచుచు, లాభము నిమిత్తము మనుష్యులకు ముఖస్తుతి చేయుదురు (కొనియాడుదురు)" అని యూదా: 16లో వ్రాయబడిన ప్రకారము అనేకులు నేడు చేయుచున్నారు. దేవునికి పక్షపాతము లేదని మనము గుర్తించుకొనాలి (ఎఫెసీ 6:9). యెహోషువ మోషేకు సేవచేసినందున అతడు మోషే పరిచారకుడని పిలువబడ్డాడు (యెహోషువ 1:1).

బోధకులు గర్విష్టులు కాకూడదు. దీన మనస్కులై యుండుడియని 1 పేతురు 5:6 చెప్పుచున్నది. "కైసరువి కైసరుకును, దేవునివి దేవునికిని చెల్లించుడని" మత్తయి 22:21 చెప్పుచున్నది. మిత్రులారా, రెవరెండ్ అను నామవాచకము దేవునిదేగాని మానవునిది కాదు.

తమ పాస్టర్‌గారు తప్పేమిచేయడని కొందరు తలస్తారు. దేవుని "ప్రవక్తలు బయలు పేరట ప్రవచనములు చెప్పుదురు, నిష్ప్రయోజనమైన వాటిని అనుసరింతురు" అని యిర్మియా 2:8 చెప్పుచున్నది. నేను ఏదైనా బోధకుని దగ్గరకు వెళ్లి "దేవుడు లోకమునెంతో ప్రేమించెను" అను వాక్యము ఎక్కడ వున్నదియని అడిగితే, యోహాను 3:16 అని తక్షణమే జవాబిస్తాడు, గాని బోధకులు రెవరెండ్లని పిలువబడాలనే వాక్యము ఎక్కడ వున్నదని అడిగితే అతడు బైబిలు రిఫరె న్సును యేమీ చెప్పలేదు. ఎందువలన? అది బైబిలులో లేనందువలన! "నామాటలు వట్టివని దృష్టాంత పరచువాడెవడు ?" అని యోబువలె వినయముతో అడుగుచున్నాను. సత్యమును అంగీకరించండి.

-జాన్ హేరిస్

---

**మీరు సత్యవాక్కు సాలు చందా చెల్లించారా? లేదా ఇప్పడే 50/- రూ॥లు పంపించి మీ పత్రిక కొనసాగించుకొనండి. క్రొత్తవారిని చేర్పించండి.**

**- ఎడిటర్**

# మీకొకగొప్పసదవకాశం

**సత్యవాణి** ద్వారా ప్రచురింపబడిన అత్యంత విలువైన పుస్తకములు 15 రకములు ఇప్పుడు లభ్యమగుచున్నవి. వాటి నికర మూల్యము 500/- రూ॥లు అగును. గాని మీరు 85/- రూ॥లు మాత్రమే మాకు M.O. పంపి వాటిని ఉచితముగా పొందవచ్చును. బైబిల్‌విద్యార్ధులకు, బోధకులకు, తర్ఫీతుశాలలకు యిది గొప్ప సదవకాశం. ఈ రోజే మాకు వ్రాయండి. M.O.పంపించి పుస్తకములను పొందండి. మీ యింటిలో మినీ లైబ్రరీని స్థాపించండి.

**Satya Vani**

#7-9-35, Sambamurth Street,

Kakinada - 533 004. Ph: 0884 - 2363722

RNI Regd. No. 69973/98

Postal Regd. No. AP-VM/KD/02/2012-2014

To

From:

SATYA VAKKU

P.O. Box 80, Kakinada - 533 001

Edited & Published by Joshua Gootam. Printed by him at Satya Vani Publication, Sambamurthy St., Kakinada - 533 004